క్లుప్తంగా

నేడు ఉపాధిహామీ సామాజిక తనిఖీ సభ

కోస్గి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ 14వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి నేడు బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19నుంచి 27వరకు గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించి తనిఖీ బృందాలు గ్రామ సభలు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది హాజరు కావాలన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్



కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ నుంచి టైరోడ్ మీదుగా కర్ణాటకకు వెళ్తున్న ఓ ఇసుక టిప్పర్‌ను శుక్రవారం ఉదయం పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ఎండీ నవీద్ మాట్లాడుతూ.. టిప్పర్ డ్రైవర్ భీమన్న, యజమాని ఆనంద్‌చౌహాన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ టిప్పర్ కర్ణాటకలోని చితాపూర్ పట్టణం, గుల్బర్గ జిల్లాకు చెందిందని అన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంతర్రాష్ట్ర రగ్బీ పోటీలకు ఎంపిక



సంధ్యారాణి

కోస్గి రూరల్: అండర్ 17రగ్బీ పోటీలలో ప్రతిభ కనబరచి తెలంగాణ రాష్ట్రం తరపున అంతరాష్ట్ర రగ్బీ పోటీలకు సంధ్యారాణి ఎంపికై నట్లు మండలంలోని సర్జఖాన్‌పేట్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కృష్ణగౌడ్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 29 నుంచి 31వరకు బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగే రగ్బీ పోటీలలో పాల్గొనున్నట్లు తెలిపా రు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు నర్సింహులును పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, వినోద్, ఆశప్ప, సాయప్ప, నవీన్, ప్రభాకర్, గంగావతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు..



శ్రీనివాస్

ధన్వాడ: ఈ నెల 28నుంచి 31వరకు తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నైలో జరిగే జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు స్థానిక కొండాపూర్ గిరిజన గురుకులకు చెందిన పదోతరగతి విద్యార్థి శ్రీనివాస్ నెట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు అకాడమీ చైర్మన్ ప్రిన్సిపాల్ రాజారాం విలేకరులకు తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సాంబయ్యనాయక్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

మరికల్: దశాబ్దాల నుంచి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎన్నో ఉద్యమాలు చేసిన తమగోడు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆ సంఘం నాయకులు నర్సింహులు, నాయకులు చంద్రప్ప, రాములు, శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో వాల్మీకులు ఎస్టీ జాబితాలో ఉంటే తెలంగాణలో ఎందుకు ఎస్టీ జాబితాలో చేర్చడం లేదని ప్రశ్నించారు. వాల్మీకులను న్యాయం చేసే పార్టీకి మా మద్దతు ఉంటుందని గత ఎన్నికల్లో హామీ ఇచ్చి గెలిచిన తమకు న్యాయం చేయడం లేదన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మరికల్: మండలంలోని రాకొండలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుర్మన్న శుక్రవారం ఆకాలంగా మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులకు మాజీ సర్పంచ్ నరహరితో కలిసి కాంగ్రెస్ నాయకులు జయసింహారెడ్డి తమవంతుగా ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోహన్‌రెడ్డి, రాములు, నాగేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్డు

మరికల్: గ్రామీణ రహదారులకు నిధులు మంజూరైన పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో మండలంలో కన్మనూర్, మాధవరం, పల్లెగడ్డ, తీలేర్, వెంకటాపూర్ వెళ్లే రహదారులపై ఇసుక టిప్పర్లు తిరగడంతో గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. టిప్పర్లను అధికారులు నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మంజూరైన నిధులతో వెంటనే రోడ్లను మరమ్మతు చేపట్టాలను వాహనదారులు కోరుతున్నారు.





పేటలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



దామరగిద్దలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

సాక్షి, నెట్‌వర్క్: భారత మాజీ ప్రధాన మంత్రి, ఆర్థిక వేత డాక్టర్ మన్మోహన్ సింగ్ గొప్ప మేధావిని, ఆయన మృతి దేశానికి తీరనిలోటని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం రాత్రి ఆయన మృతి చెందడంతో జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాలు, గ్రామాల్లో ప్రధాన కూడళ్లు, కాంగ్రెస్ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు.. ప్రధానిగా దేశంలో ఆర్థిక సంస్కరణలు చేశారని, వారి సేవలను కొనియాడారు.

❐ **మక్తల్:** మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆయన మృతి పట్ల పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మారెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, కోళ్ల వెంకటేష్, రవికుమార్, గణేష్‌కుమార్, కట్టసురేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

❐ కోస్గి పట్టణంలోని శివాజీ చౌరస్తాలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మున్సిపాలిటీ అధ్యక్షుడు బెజ్జురాములు, శ్రీనివాస్, భీంరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

❐ మరికల్‌లోని స్థానిక ఇందిరాగాంధీ చౌరస్తాలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి మౌనం పాటించారు. వీరన్న, గొల్ల కృష్ణయ్య, ఆనంద్, హరీష్, గోపాల్, నర్సింహులు పాల్గొన్నారు.

❐ ఊట్కూరులో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. యజ్ఞేశ్వర్‌రెడ్డి, సూర్యప్రకాష్ రెడ్డి, బాల్‌రెడ్డి, మహేష్ కుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.



కోస్గిలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

❐ కృష్ణా మండల కేంద్రంలోని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. యవజన కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ సర్ఫరాజ్, సిద్రామప్ప, భీంసీ నాయక్, తిమ్మన్న, వీరేష్‌నాయక్, లక్ష్మణ్, సిరాజ్ పాల్గొన్నారు.



ధన్వాడలో..

❐ మద్దూరు మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద మండల కాంగ్రెస్ నాయకులు ప్రధాని మన్మోహన్‌సింగ్‌చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భీములు, నాయకులు శివరాజ్, సుభాష్, బాబు స్వామి, చాంద్‌పాషా, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాలో..



మరికల్‌లో..



మద్దూరులో..

ఇథనాల్ కంపెనీని రద్దుచేయాలి

నర్వ: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇథనాల్ కంపెనీని రద్దు చేస్తామనే హామీని నిలబెట్టుకోలేదని టీపీజేఏసీ నాయకులు అన్నారు. శుక్రవారం ఉందేకోడ్‌లో టీపీజేఏసీ ఆధ్వర్యంలో చిత్తనూర్ కంపెనీ రద్దు చేయాలని బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేడు కంపెనీ యాజమాన్యం అత్యంత ప్రమాదకరమైన సింథటిక్ కెమికల్స్ పరిశ్రమను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా అక్రమంగా అమ్మోనియం ప్లాంటు నిర్మాణం చేయడానికి కంపెనీ యాజమాన్యం ప్రయత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు బండారి లక్ష్మయ్య, శ్రీదేవి, చక్రవర్తి, రామారావు, మహాదేవ్, రాంచందర్, లింగమయ్య, మధు పాల్గొన్నారు.



బ్రోచర్‌లను విడుదల చేస్తున్న నాయకులు

ఎస్‌ఐకి సన్మానం



ఊట్కూరు: మండలంలోని ఎస్‌ఐ కృష్ణంరాజును శుక్రవారం జ్యోతిరావు పూలే బీసీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు ముదిరాజ్ శాలువాతో సన్మానించారు. మండలంలో ఇటీవల జరిగిన పలు కేసులపై ఎస్‌ఐతో చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ మహాసభ నియోజకవర్గ అధ్యక్షుడి ఎన్నిక

కోస్గి రూరల్: అఖిల భారత యాదవ మహాసభ నియోజకవర్గ అధ్యక్షుడిగా అల్లపూరం నర్సింహులు ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు బాలప్ప, సభ్యులు రఘువీర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు నర్సింహులు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి పాటు పడతానని అన్నారు. అనంతరం ఆయనకు నాయకులు పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనావాస్, రమేష్, హన్మంతు, చెన్నప్ప, శ్రీనివాస్ ఉన్నారు.

- మండలంలో 612 ఎకరాల్లో వేరుశనగ
- వరినాట్లకు సిద్ధమవుతున్న రైతులు
- అదే తరహాలో దోస, ఉల్లి, ఆముదంసాగుపై దృష్టి

యాసంగిపైనే ఆశలు



యాసంగిలో సాగు చేసిన వేరుశనగ పంట



మరికల్‌లో వరినాట్లు వేస్తున్న కూలీలు

మరికల్: వానాకాలం అతివృష్టి కారణంగా చేతికొచ్చిన పంటలు తెగుళ్ల భారిన పడటంతో రైతన్నలు కష్టాల్లో కురుకుపోయారు. వానాకాలం మారకముందే యాసంగి సిజన్ వచ్చేసింది. నష్టాలను పూడ్చుకునేందుకు రైతులు వేరుశనగ, ఆముదం, వరి తదితర పంటల సాగుపై ఆశలు పెట్టుకున్నారు. కాని చలి, మంచు తీవ్రత కారణంగా వరినారు మళ్లకు, ఆముదం, వేరుశనగ పంటలకు అనేక తెగుళ్ల సోకడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ఇప్పుడిప్పుడే వరిసాగుకు రైతులు సిద్ధమవుతున్నారు.

మండలంలో ఇలా..

మండలంలో యాసంగి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. 15వేల ఎకరాల్లో వరిసాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే 612 ఎకరాల్లో వేరుశనగ, 175 ఎకరాల్లో ఆముదం పంటలను సాగు చేశారు. గత ఏడాది వేరుశనగ పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రైతులు పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదు. అధిక ధరలకు మందులు తెచ్చిపిచికారి చేసిన పంటకు తెగుళ్ల వదలడం లేదు. ఎకరాకు రూ. 30వేల చొప్పున పెట్టుబడులు పెట్టిన తెగుళ్ల బెడద వదలకపోవడంతో నష్టాలను కొని తెచ్చుకుంటున్నారు. గత ఏడాది మార్కెట్‌లో క్వింటాల్ వేరు శనగకు రూ. 5500నుంచి 6వేల లోపు కొనుగోలు చేశారు. ఈ ఏడాది కూడా అదే ధరలకు కొనుగోలు చేస్తే నష్టాలే తప్ప లాభాలు ఉండవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అడవి పందుల బెడద ఉంది..



మూడు ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశాను. పంట చేతికొచ్చే సమయంలో అడవి పందుల బెడద పట్టుకుంది. పంటకాపు దశలో ఉండగానే రాత్రివేళలో పందులు దాడిచేసి పంటను నాశనం చేయడంతో నష్టపోతున్నాం. పంటను రక్షించుకునేందుకు చీరలను కొనుగోలు చేసి పంట చుట్టూ కట్టి కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- శ్రీనివాసులు, మరికల్

పెట్టుబడులు మీద పడుతున్నాయి..



వానాకాలంలో వర్షాలు అధికంగా కురువడంతో వరి దిగుబడి తగ్గింది. ఆ నష్టాన్ని పూడ్చుకునేందుకు యాసంగి వరి పంటపై ఆశలు పెట్టుకున్నాం. పెరిగిన ఫర్టిలైజర్, కూలీల ధరల కారణంగా పెట్టుబడులు పెరుగుతున్నాయి. పంట చేతికొచ్చి అమ్మబోతే ధరలు ఉండవు.

- రాములు, మరికల్

అవగాహన కల్పించాం

యాసంగిలో సాగుచేసిన వేరుశనగ, వరి పంటలపై ఇది వరకే రైతులకు అవగాహన కల్పించాం. ప్రమాదకరమైన తెగుళ్ల సోకితే వ్యవసాయధికారులను సంప్రందించి మందులను పిచికారి చేసి నష్టాన్ని తగ్గించుకుంటే దిగుబడులు పెరిగే అవకాశం ఉంది.

- పరుశురాం, ఏఈఓ, మరికల్

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



ఊట్కూరులో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న అధికారులు



వర్కూర్‌లో ..



దామరగిద్దలో..

మాగనూర్: మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. శుక్రవారం వర్కూర్ గ్రామంలో ప్రజాపాలనలో ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంచాయతీ కార్యదర్శులు వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఎంపీడీఓ రహమ్మతుద్దీన్ మాట్లాడుతూ.. లబ్ధిదారులు సర్వే అధికారులకు కావాల్సిన పత్రాలను అందజేసి వారికి సహకరించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని దాసర్‌దొడ్డి, చిట్యాల, సంగంబండ గ్రామాల్లో శుక్రవారం అధికారులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో కలిసి ఇళ్ల సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, కార్యదర్శులు మధు, శారద, అరవింద్ పాల్గొన్నారు.

సర్వేలో వివరాలు నమోదుచేయించాలి

దామరగిద్ద: మండలంలోని లక్ష్మీపూర్‌లో ప్రజాపాలనలో ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటికి కాంగ్రెస్ నాయకులు వెళ్లి అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి కళావతి, భగవంతుగౌడ్, నర్సింహులు, రవీందర్‌రెడ్డి, సాయిరెడ్డి, గోవింద్‌రెడ్డి, పరిపూర్ణం, ఆనంద్ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. శుక్రవారం ఊట్కూరు, పులిమామిడి, బిజ్వార్, చిన్నపొర్ల తదితర గ్రామాల్లో అధికారులు ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులతో కలిసి సర్వేను చేపట్టారు. గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు, శివ, భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని మున్సిపాల్ పార్క్ వద్ద ఉద్యోగ భద్రత కల్పించాలంటూ సమగ్రశిక్ష ఉద్యోగులు సమ్మె కొనసాగిస్తున్నారు. శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పటానికి పూలమాలవేసి మౌనం పాటించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప, తపస్ నాయకుడు రామకృష్ణ సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ... సమగ్ర శిక్ష ఉద్యోగులు 16రోజులుగా సమ్మెలో ఉన్నా, ప్రభుత్వం పట్టించుకోకుండా ఇప్పుడు కేజీబీవీలో తాత్కాలికంగా పని చేయడానికి కొందరిని ఉపాధ్యాయులుగా నియమించిందని వాపోయారు. కార్యక్రమంలో ఎల్లోగౌడ్, అల్తాప్, లక్ష్మణ్, నరేష్, గౌరమ్మ, శాలిని, విజయ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి



మక్తల్‌లో ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

మక్తల్: పంచాయతీ కార్మికులకు రూ. 26వేల వేతనం చెల్లించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. కార్మికుల పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, జీఓ నం .51, మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, నరేష్, వెంకటయ్య, చంద్రప్ప, నర్సింహులు, సాయప్ప, హన్మంతు, మహేష్, మల్లేష్, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: పంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేశారు. పంచాయతీలో చాలీచాలని వేతనాలతో గత కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న కనీస వేతనం అందడం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి నెల రూ. 26వేల వేతనం అందించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాములు, మొగులప్ప, భీములు, సులోచన, ఆంజనేయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

నర్వ: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గొల్ల రాంచంద్రి మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం, ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, ప్రమాద బీమా వంటి సదుపాయాలను ప్రభుత్వం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గొల్లరాంచంద్రి, నర్సింహులుగౌడ్, శ్రీనివాసులు గౌడ్, యాంకి శ్రీను, పాష, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



ధన్వాడలో ధర్నా చేస్తున్న కార్మికులు

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి..

ధన్వాడ: పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేసి మాట్లాడారు.. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి బాల్‌రాం, నాయకులు రాము, బాలకృష్ణ, కృష్ణయ్య, భాను, ఇమ్రాన్, ఎర్రప్ప, రవికుమార్ పాల్గొన్నారు.

మరుగునపడ్డ ఫ్రై డే.. డ్రై డే

అమరచింత: జిల్లాలోని మున్సిపాలిటీలతో పాటు గ్రామాల్లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే విధంగా నిర్వహిస్తున్న డ్రై డే కార్యక్రమాలు మరుగునపడ్డాయి. గ్రామాలతో పాటు పట్టణాల్లో ప్రభుత్వ పరంగా వివిధ సర్వే కార్యక్రమాలు ఉన్నాయని, ఉన్న సిబ్బందితో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుందనే సాకుతో పారిశుద్ధ్య పనులను మరుగున పడేశారని పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీల్లో మాత్రం ప్రతిరోజు తెల్లవారుజామున ప్రధాన రహదారుల శుభ్రత పనులను చేపట్టడంతోనే సరిపెడుతున్నారు. మురుగుకాల్వలు నిండినా.. మురుగును తొలగించే పనులు చేపట్టలేకపోతున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో కాలనీల్లో దుర్గంధం వస్తుందని ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫాగింగ్‌తో పాటు మురుగుకాల్వలను శుభ్రపరిచే కార్యక్రమాలను చేపట్టాలని కోరుతున్నారు.



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది (ఫైల్)

నల్లబ్యాడ్జీలు ధరించి '104' ఉద్యోగుల నిరసన

అమరచింత: జిల్లాలోని ఆస్పత్రులలో విధులు నిర్వహిస్తున్న తమకు ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదంటూ శుక్రవారం '104' ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా అమరచింత డీఎంఆర్ఎం ఆస్పత్రిలో శుక్రవారం ల్యాబ్ టెక్నీషియన్ రాజుతో పాటు సిబ్బంది నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ అక్టోబర్ వరకు ఆరు నెలల వేతనాలు బకాయిలుగా ఉండటం వల్ల 104 ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ సమస్యపై అనేక పర్యాయాలు ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇస్తున్న ఫలితం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 4న జీఓ నంబర్ 706 ప్రకారం.. రూ.12.56 కోట్లు విడుదల చేసిందని, అయినా నేటి వరకు ఉద్యోగస్తులకు అందలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి తమకు బకాయిలో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు.



నల్లబ్యాడ్జీ ధరించి విధులు నిర్వహిస్తున్న సిబ్బంది